క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో నేడు (బుధవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టీజీఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబ రెడ్డి తెలిపారు. భవానినగర్ ప్రాంతంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్నిక



పూర్ణేందర్‌రెడ్డి

వరంగల్/హన్మకొండ కల్చరల్ : వరంగల్ కాశిబుగ్గ తిలక్ రోడ్డు, అనుబంధ వీధుల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా లక్కిరెడ్డి పూర్ణేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వరంగల్ తిలక్ రోడ్‌లోని ఓ ప్రైవేట్ హాల్‌లో కాలనీవాసులు రామరవీందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా పూర్ణేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీల సమస్యలతో పాటు అభివృద్ధి పనులను, సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మినీ వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మహేందర్



వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లా మినీ వ్యాన్ (డీసీఎం) ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా తాళ్లపల్లి మహేందర్ ఎన్నికయ్యారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా ఆరె రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నరేష్, కోశాధికారిగా వంచ రంగారెడ్డి, సహాయ కార్యదర్శిగా పి. కొమురయ్య ఎన్నికయ్యారు.

పింఛన్లు అమలు చేయాలి



రామన్నపేట : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులకు రూ.4 వేల కొత్త పింఛన్లు అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అరూరి కుమార్ డిమాండ్ చేశారు.మంగళవారం నగరంలోని 29వ డివిజన్ పాపయ్యపేట ప్రాంతంలో సీపీఎం బృందం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన హామీ అమలు చేయడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శులు రంగరాజు, విజయ, చంద్రమౌళి, రాజేశ్వరి, ఇందిరా, సరిత పాల్గొన్నారు.

పీఎంశ్రీ కేవీలో ప్రవేశాలకు వేళాయె

- ఈ ఏడాది కూడా బాల్‌వాటిక ప్రవేశాలు లేనట్లే..
- 1వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 21వ తేదీ వరకు అవకాశం

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 1వ తరగతిలో ప్రవేశాలకు కేవీ సంఘటన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. జిల్లాలోనే అత్యుత్తమ సెంట్రల్ సిలబస్ విద్యనందిస్తున్న ఏకైక విద్యాలయంగా పేరుగాంచిన కేవీ వరంగల్‌లో ప్రవేశాలను పొందేందుకు ప్రతీ ఏడాది విద్యార్థులు పోటీ పడుతుంటారు. తమ పిల్లలను కేవీ వరంగల్‌లో 1వ తరగతిలో చేర్పిస్తే 12వ తరగతి వరకు ఒకే చోట విద్యనందుకుంటారని సెంట్రల్, స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగులతో పాటు ప్రైవేట్ ఉద్యోగులు ఆసక్తి కనబరుస్తున్నారు.

రెండు సెక్షన్లు.. 80 సీట్లు

కడిపికొండలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో రెండు సెక్షన్‌లకు గాను 80 సీట్లు కేటాయించారు. ఇందులో భాగంగా ఒకటో తరగతిలో ప్రవేశానికి 80 మందికి ప్రవేశాన్ని పొందే అవకాశం ఉంది. కాగా.. ఈ ఏడాది 80 సీట్లు కేవలం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా.. కంప్యూటర్ ర్యాండమ్ పద్ధతిలో ఎంపిక చేస్తుంది. గతంలో ఎంపీ కోటా, కేవీ విద్యాలయ చైర్మన్ కోటా కింద ఉన్న సీట్లను ఈసారి తొలగించడంతో అర్హులకే ఆన్‌లైన్ లో సీట్లు దక్కే అవకాశం ఉంది.

బాల్‌వాటికకు ఈ ఏడాది నో చాన్స్

గతేడాది ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా 1,244 కేంద్రీయ విద్యాలయాలుండగా.. 834 కేవీలను పీఎంశ్రీ (ప్రధాన మంత్రి రేసింగ్ ఫర్ స్కూల్) కేంద్రీయ విద్యాలయాలను ఎంపిక చేశారు. అందులో కేవీ వరంగల్ కూడా ఎంపికైంది.



పీఎంశ్రీ కేవీ వరంగల్ స్కూల్

ఆర్టీఈ(రైట్ టు ఎడ్యుకేషన్) : 10 సీట్లు
ఎస్సీ - 15 శాతం :12 సీట్లు
ఎస్టీ -7.5శాతం : 6 సీట్లు
ఓబీసీ - ఎన్‌సీఎల్ - 27 శాతం : 22సీట్లు
ప్రత్యేక అవసరాల విద్యార్థులు 3 శాతం : 2 సీట్లు

పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయానికి ఎంపికైతే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలకు సైతం ప్రవేశాలను కల్పిస్తారు. కాగా.. గతంలో మాదిరిగానే కేవలం 1వ తరగతిలోకి మాత్రమే కేవీ వరంగల్ అవకాశం కల్పిస్తోంది. బాల్‌వాటికను ఈ ఏడాది కూడా ప్రారంభించడం లేదు.

అర్హతలు ఇవీ...

పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో ఒకటో తరగతిలో ప్రవేశానికిగాను విద్యార్థి 6 నుంచి 8 ఏళ్ల మధ్య వయస్కులై ఉండాలి. తొలి ప్రాధాన్యం సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగులు, సెంట్రల్ గవర్నమెంట్ సంబంధిత ప్రాజెక్టు ఉద్యోగులు, రెండో ప్రాధాన్యం స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగులతో పాటు స్టేట్ గవర్నమెంట్ సంబంధిత ప్రాజెక్ట్ ఉద్యోగులు ఎకనామికల్ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) కోటా, ఆర్టీఈ (ఎకనామికల్లీ వీకర్ సెక్షన్)లకు సీట్లను కంప్యూటర్ ద్వారా ర్యాండమ్ సెలక్షన్స్‌లో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారు.

అందజేయాల్సిన సర్టిఫికెట్లు..

పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయాల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికిగాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న తరుణంలో బర్త్ సర్టిఫికెట్ సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్‌ను ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వారు కుల ధ్రువీకరణ పత్రం, 5 కిలోమీటర్ల లోపు నివాసం ఉంటున్న వారికే ప్రాధాన్యం కల్పించనున్నారు. ఇందుకుగాను నివాస ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి.

21వ తేదీ వరకు అవకాశం..

పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయలో ఒకటో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో kvs online admission.kvs.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 21లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చివరి తేదీ అనంతరం విద్యార్థులను లాటరీ పద్ధతిలో కంప్యూటర్ ర్యాండమ్‌గా ఎంపికను కేవీ ప్రిన్సిపాల్ గవర్నర్‌గా, ఒక టీచర్, ఇద్దరు పేరెంట్స్, ఒక వీఎంసీ మెంబర్‌తో కూడిన కమిటీ సమక్షంలో లాటరీ పద్ధతిలో సీట్ల కేటాయింపు ఉంటుంది. ఎంపికైన విద్యార్థుల తొలి జాబితా మార్చి 23న, రెండో జాబితాను ఏప్రిల్ 2న వెల్లడిస్తారు.

తరగతి గదులు లేవు

పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో బాలవాటిక ప్రవేశాలను అందజేసేందుకుగాను సరిపడా తరగతి గదులు లేవు. ఇందుకుగాను బాలవాటిక ప్రవేశాలు 2025-26 విద్యా సంవత్సరానికి కూడా ఉండవు. రాబోయే విద్యా సంవత్సరానికి బాలవాటిక నిర్వాహణకు ఆరు తరగతి గదుల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలను పంపించాం. తరగతి గదులు అందుబాటులోకి వస్తే బాలవాటిక ప్రవేశాలను స్వీకరిస్తాం. ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేయడానికి పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి.

\- సుభాషిణి, ప్రిన్సిపాల్, కేవీ, వరంగల్

సీనియర్ సిటిజన్ల సేవలు అభినందనీయం

- కలెక్టర్ ప్రావీణ్య



కలెక్టర్‌కు నివేదిక అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్ బాధ్యులు

హన్మకొండ అర్బన్ : కలెక్టరేట్‌కు వచ్చే వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడకుండా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఫిర్యాదులకు సంబంధించి దరఖాస్తులు రాయడం వంటి సహాయాన్ని అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విద్యారణ్యపురి, గోపాల్‌పూర్ బాధ్యుల సేవలను కలెక్టర్ ప్రావీణ్య అభినందించారు. గ్రీవెన్స్ సెల్ హెల్ప్‌డెస్క్ కార్యకలాపాల పూర్తి నివేదికను అసోసియేషన్ బాధ్యులు మంగళవారం కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ వృద్ధులు, మహిళల సమస్యల పరిష్కారం కోసం అసోసియేషన్ అందించే సేవలకు జిల్లా యంత్రాంగం పూర్తి మద్దతుగా నిలుస్తోందని పేర్కొన్నారు. అసోసియేషన్ సభ్యులు ప్రజావాణి సహాయ కేంద్రంలో హెల్ప్‌డెస్క్ సేవలు కొనసాగించేందుకు అనుమతి కోరారు. అసోసియేషన్ కార్యదర్శి తీరాల యుగేందర్, సంయుక్త కార్యదర్శి మార్క రవీందర్ గౌడ్, కోశాధికారి బత్తిని రాజేందర్, బాధ్యులు గుంటి సీతారాములు, శివాజీ, గంటి సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఉద్యోగులపై చర్యలు తప్పవు

- వేసవి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

నయీంనగర్ : నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం కుడా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, కుడా వీసీ అశ్విని తానాజీ వాకడేలతో కలిసి రాజేందర్ రెడ్డి సమీక్షించారు. నగరంలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా ప్రారంభించాలని, స్మార్ట్ సిటీ నిధుల ద్వారా జరుగుతున్న పనుల పురోగతిపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రక్షాళన చేయాలని, డబ్బులు వసూళ్లు చేస్తూ అవినీతికి పాల్పడుతున్న అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవికాలం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలకు నియోజకవర్గంలో ఉన్న 24 ప్రధాన పార్క్‌లలో మరమ్మతులు చేయాలన్నారు. మున్సిపల్, కుడా, ఉద్యానవన శాఖ అధికారులు సమష్టిగా మొక్కల పెంపకం, పచ్చదనంపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజాపాలన సాగించాలని కోరారు.

న్యాయం చేయాలని ఆందోళన

- క్యూర్‌వెల్ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల బైఠాయింపు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబీకులు

ఎంజీఎం : వైద్యురాలి నిర్లక్ష్యంతోనే గర్భిణి మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు నగరంలోని క్యూర్‌వెల్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రసవం కోసం వచ్చిన జింకల ప్రవళిక వైద్యురాలి నిర్లక్ష్యంతోనే చనిపోయిందంటూ ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని వేడుకుంటూ రోదిస్తూ ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. చివరకు కుటుంబ సభ్యులను పోలీసులు శాంతింపచేసి ఆందోళన విరమింపచేశారు. మృతురాలి భర్త రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎలాంటి నిర్లక్ష్యం లేదు: హేమ, వైద్యురాలు

ప్రవళికకు చికిత్స చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదు. నిబంధనల ప్రకారం అందరి వైద్యుల సహకారంతో చికిత్స అందించాం. అనుకోని ఘటనలో శస్త్రచికిత్స సమయంలో గర్భిణులకు తీవ్ర రక్తస్రావం జరుగుతుంది. రక్తస్రావం జరగకుండా వైద్యచికిత్సలు చేసిన అనంతరం ప్రవళిక శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి మృతి చెందింది.

డాక్యుమెంట్స్ ఎప్పుడు ఇస్తారు?

- పది రోజులుగా రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

కాజీపేట అర్బన్ : భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ ఎప్పుడు ఇస్తారంటూ వరంగల్ ఆర్వో కార్యాలయం చుట్టూ భూక్రయ, విక్రయదారులు తిరుగుతున్నారు. సాధారణంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన రోజు లేదా మరుసటి రోజు దస్తావేజులను భూక్రయ దారులకు అధికారులు అందజేయాలి. ఇందుకు భిన్నంగా వరంగల్ ఆర్వో కార్యాలయంలో పది రోజులుగా భూక్రయ, విక్రయదారులను రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ ఇవ్వకుండా తిప్పుకుంటున్నారు. సబ్ రిజిస్ట్రార్లను అడుగగా ఇంకా స్కానింగ్ కాలేదు, సర్వర్ స్లోగా ఉందంటూ పొంతనలేని సమాధానాలు చెబున్నారు.

సామాన్యులకు తప్పని తిప్పలు..

వరంగల్ ఆర్వో కార్యాలయంలో ప్రతి రోజు 50 నుంచి 80 దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తవుతాయి. దస్తావేజులు స్కానింగ్ చేసే ఉద్యోగిని డాక్యుమెంట్స్ ఎప్పుడు ఇస్తారని అడడగా ఇంకా సార్ సంతకం చేయలేదు అందుకే లేట్ అవుతుందని తెలపడం గమనార్హం. సదరు సార్ ఎందుకు సంతకం చేయడం లేదు, కొన్ని దస్తావేజులు కార్యాలయం దాటి సార్ ఇంటికి సైతం వెళ్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా మంగళవారం నాటికి సుమారు 450కి పైగా దస్తావేజులు స్కానింగ్‌కు నోచుకోక భూక్రయదారుల చేతికందలేదు.

సేవ అంతర్భాగం

- టాలీ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అసిస్టెంట్ ఆర్ఎం మల్లేశం గుప్తా

హసన్‌పర్తి : రోజువారీ వ్యాపారాల్లో సేవ అంతర్భాగమని టాలీ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అసిస్టెంట్ రీజినల్ మేనేజర్ మల్లేశం గుప్తా అన్నారు. మంగళవారం కిట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో 'అప్లికేషన్ టాలీ' అనే అంశంపై ఎఫ్‌డీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్లేశం గుప్తా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భౌగోళిక సరిహద్దులు, వ్యాపార సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించడం, ఉద్యోగ అవకాశాలు పెరగడం అనే అంశాలను వివరించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, ప్రొఫెసర్ సురేందర్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకరాచారి, జి.రత్నాకర్, సునీతాచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

'గ్రూప్స్ ఫలితాలు నిలిపివేయాలి'



హసన్‌పర్తి: మాట్లాడుతున్న రవిమాదిగ



కేయూలో దీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న సమ్మయ్య. పక్కన హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్



హన్మకొండ: మాట్లాడుతున్న ఎంఎస్పీ జాతీయ నాయకుడు సూరన్న

హసన్‌పర్తి/కేయూ క్యాంపస్ : వర్గీకరణ అమలయ్యేంత వరకు గ్రూప్స్ పరీక్ష ఫలితాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు పుట్ట రవిమాదిగ, కేయూ ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మార్పీఎస్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఆధ్వర్యంలో హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట, కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం వద్ద నిరసన దీక్షలు చేపట్టారు. హసన్‌పర్తిలో నిర్వహించిన కార్యక్రమానికి రవిమాదిగ పాల్గొని సంఘీభావం ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. త్వరలో విస్తరించనున్న మంత్రి వర్గంలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆరెపల్లి పవన్, రాజారపు భిక్షపతి, రేనుకుంట్ల దుర్గాప్రసాద్, సాంబారాజు, నమిండ్ల సూర్యం, తాళ్ల సంపత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మాట నిలుపుకోలేని సీఎం రేవంత్‌రెడ్డి
ఎంఎస్పీ జాతీయ నాయకుడు సూరన్న

హన్మకొండ : అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణ మాటఇచ్చి నిలబెట్టుకోలేని సీఎంగా రేవంత్ రెడ్డి చరిత్ర హీనుడిగా మిగిలిపోతాడని ఎంఎస్పీ జాతీయ నాయకుడు వేల్పుల సూరన్న అన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఉద్యోగ ఫలితాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఏకశిలా పార్కు వద్ద చేస్తున్న దీక్ష మంగళవారం మూడో రోజుకు చేరింది. ఈ దీక్షలకు సూరన్న కాపు సంఘీభావం తెలిపి మాట్లాడారు. రేవంత్ రెడ్డి మాదిగలను నమ్మించి మోసం చేస్తున్నాడన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ఆత్మ పరిశీలన చేసుకొని మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, నాయకులు జన్ను దినేష్ మాదిగ, మంద రాజు మాదిగ, బండారి సురేందర్ మాదిగ, చేతల్ల శివ మాదిగ, అక్కెనకుంట వెంకటస్వామి, జెరిపోతుల సారంగపాణి, మంద వీరస్వామి, మంద వర్ధన్ మాదిగ పాల్గొన్నారు.

కాజీపేట: ఎఫ్‌సీఐలో మహిళా ఉద్యోగులు



హన్మకొండ: మాట్లాడుతున్న జె.జయంతి



హన్మకొండ: కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ ఉద్యోగులు



మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

మహిళలు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో రాణించాలని పలువురు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లావ్యాప్తంగా మహిళలను, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో కేంద్ర పురావస్తు శాఖ హైదరాబాద్ డిప్యూటీ సూపరింటెండెంట్ హెచ్ ఆర్ దేశాయ్, హనుమకొండ జిల్లా సంక్షేమాధికారి జె.జయంతి, ప్రజాస్వామిక రచయితల సంఘం ప్రతినిధి అనిశెట్టి రజిత, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకురాలు బి.రమాదేవి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



ఖిలా వరంగల్: కాకతీయ తోరణం ఎదుట మహిళలు, కార్పొరేటర్లు, కేంద్ర పురావస్తుశాఖ అధికారులు

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళ

- ప్రదర్శనలో పలు రాష్ట్రాల ఉత్పత్తులు



ప్రదర్శనలో షాపింగ్ చేస్తున్న వినియోగదారులు

హన్మకొండ చౌరస్తా : హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. వారం రోజుల పాటు కొనసాగనున్న చేనేత హస్తకళా ప్రదర్శన మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. దేశంలో ఎంపికైన చేనేత కళాకారులు అద్భుత అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ వస్త్రాలు ఆకర్షిస్తున్నాయి. అంతే కాకుండా తెలంగాణలోని గద్వాల, నారాయణపేట, పోచంపల్లి ఆంధ్రప్రదేశ్‌లోని ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కళంకారి, ఉప్పాడ, అస్సాంలోని మూగా, ఎరిశిల్క్, బిహార్‌లోని బాగల్పుర సిల్క్, టస్సర్, ఛత్తీస్‌గఢ్‌లోని ట్రిబిల్ వర్క్స్, కోసా సిల్క్, గుజరాత్‌లోని బాందని, కచ్ఛ ఎంబ్రాయిడరీ డ్రెస్, శారీస్, జమ్ముకశ్మీర్‌లోని ఎంబ్రాయిడరీ శారీస్, డ్రెస్ మెటీరియల్స్, పాస్మికశాల్, కర్ణాటకలోని క్రేప్, ప్రింటెడ్ శారీస్, మధ్యప్రదేశ్‌లోని చందేరి, మహేశ్వరీ, రాజస్తాన్‌లోని కోటా, బందాని, బ్లాక్ ప్రింట్, సంగ్నరి ప్రింట్, ఉత్తరప్రదేశ్ లోని జమ్దాని, బనారస్, లక్నో డ్రెస్ మెటీరియల్‌తో పాటు హర్యానా బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, లక్నో కుర్తీస్, డోర్ కర్టన్స్, తదితర రాష్ట్రాల హ్యాండీక్రాఫ్ట్స్, న్యూట్రిషన్ ఫుడ్‌ను విక్రయిస్తున్నారు. చేనేత హస్తకళా ప్రదర్శన మేనేజర్ బిజు మండల్ మాట్లాడుతూ.. చేనేత వస్త్రాలు, హస్తకళలు, హ్యాండ్‌లూమ్స్, హ్యాండిక్రాఫ్ట్స్‌ను ఆదరించాలని కోరారు. వరంగల్ ప్రజలు ఎగ్జిబిషన్‌ను వినియోగించుకొని చేనేత కళాకారులకు చేయూత ఇచ్చేందుకు ముందుకు రావాలని అన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాజీపేట రూరల్ : కాజీపేట జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజీపేట-హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య చింతగట్టు అండర్ బ్రిడ్జి వద్ద అప్‌లైన్‌లో మంగళవారం గుర్తు తెలియని సుమారు 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. జీఆర్పీ కానిస్టేబుల్ సి.రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు పసుపు రంగు షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. 5.3 ఎత్తు, చామనచాయ రంగు, ఛాతిపై పుట్టు మచ్చ కలదు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురికి తరలించారు. వివరాలకు 87125 68496, 99483 48070 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నిషేధిత గుట్కా పట్టివేత

రామన్నపేట : వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిన్నావారి వీధిలో గుట్కా విక్రయిస్తున్న రవ్వ వరప్రసాద్ నుంచిరూ.46,300 విలువైన గుట్కా నిల్వలు, గిర్మాజీపేటకుచెందిన కొటాడియా ఆరీఫ్ అనే వ్యక్తి నుంచి రూ.40,150 విలువైన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ మంగళవారం తెలిపారు.

రూ.90వేల విలువైన వెండి చోరీ

వరంగల్ : వరంగల్ 13వ డివిజన్ కల్యాణి నగర్‌కు చెందిన ఉదయ్‌కిరణ్ ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లాడు. మంగళవారం ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూశాడు. సుమారు రూ.90వేల విలువైన వెండి సామగ్రి చోరీకి గురైనట్లు బాధితుడు వివరించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు.

పండ్ల దుకాణంలో..

వరంగల్ క్రైం : సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట ఉన్న పండ్ల దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. వ్యాపారి రాత్రి 10 గంటల వరకు పండ్లు అమ్ముకొని మిగితావి అక్కడే పెట్టి తాళాలు వేసుకొని వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు రూ.30 వేల విలువైన పండ్లు, రెండు కాంటా బాటాలు దొంగతనం చేయడంతో బాధితుడు సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సంక్షిప్త సమాచారం

పట్టపగలే చైన్ స్నాచింగ్

వరంగల్ క్రైం : హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డి కాలనీలో పట్టపగలే వృద్ధురాలి మెడలో నుంచి మంగళవారం బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం ..రెడ్డికాలనీకి చెందిన విజయ ఉదయం ఆస్పత్రికి వెళ్లి ఇంటికి వచ్చి గేటు తీస్తున్న క్రమంలో గుర్తు తెలియని ఇద్దరు బైక్‌పై వచ్చి బంగారు గొలుసును ఎత్తుకుపోయినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మడికొండ : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మడికొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన పోట్లబత్తిని రమేశ్ కనిపించాడు. రమేశ్‌ను పట్టుకొని విచారించగా ఆటోలో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. బియ్యం విలువ రూ.6వేల విలువ ఉంటుందని తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్ : ఆర్థిక ఇబ్బందులతో పాటు మద్యానికి బానిసై మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. శివనగర్‌కు చెందిన ఎర్ర గౌతమ్ (22) కూలీపని చేస్తు జీవిస్తున్నాడు. ఇటీవల పనిదొరక మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఇంట్లో లేని సమయంలో సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి కవిత ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

ఆలయ భూమి కబ్జా

హసన్‌పర్తి : మండల కేంద్రంలోని మహంకాళి ఆలయ భూమి కబ్జాకు గురైందని స్థానికులు ఆరోపించారు. స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

నేమ్ బోర్డుల పంపిణీ

న్యూశాయంపేట : వరంగల్ క్రిస్టియన్ సొసైటీ ఆధ్వర్యంలో సరిగొమ్ముల సుగుణమ్మ-ప్రకాశం జ్ఞాపకార్థం నగరంలోని 50 చర్చిలకు ఉచితంగా నేమ్ బోర్డులను పంపిణీ చేసినట్లు సొసైటీ చైర్మన్ దీన్‌దయాల్ మంగళవారం పేర్కొన్నారు.

'కోర్టు తీర్పుపై హర్షం'

హన్మకొండ అర్బన్ : ప్రణయ్ హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షిస్తూ కోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రడపాక పరంజ్యోతి మంగళవారం పేర్కొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కాజీపేట : చైతన్యపురి కాలనీలోని గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణలో మహిళలు వెయ్యి దీపాలతో అలంకరించారు.

వ్యాపారవేత్తకు నివాళి

వరంగల్ చౌరస్తా : పిన్నావారి వీధికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త, దివంగత కే.ఎస్ మూర్తికి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట సంపత్ కుమార్‌తో పాటు తదితరులు మంగళవారం నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ రంగాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు

వరంగల్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు సరుకుల విక్రయాలకు వస్తున్న రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి జి.రెడ్డి మంగళవారం తెలిపారు. ఎండలు పెరుగుతున్నందున మార్కెట్‌కు వచ్చే రైతులకు మజ్జిగ ప్యాకెట్లు అందించాలని రైతు సంఘాలు, దడవాయి సంఘాలు వినతి పత్రాలు అందించాయని వెల్లడించారు. ఈ మేరకు అనుమతి కోసం ఉన్నతాధికారులకు లేఖ రాశామని, అనుమతి వచ్చిన వెంటనే మార్కెట్‌లోని అన్ని యార్డుల్లో మజ్జిగ ప్యాకెట్లను రైతులకు అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

విద్యారంగానికి 30శాతం బడ్జెట్ కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్



ఖిలా వరంగల్ : రానున్న అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 30శాతం బడ్జెట్ కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ కోరారు. వరంగల్ ఉర్సుగుట్టలోని సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ అధ్యక్షతన మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఏటా విద్యారంగానికి నిధులు కేటాయించకుండా పాలకులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసమావేశంలో సీహెచ్ రంగయ్య, అరూరి కుమార్, సింగారపు బాబు, వల్లదాసి దుర్గయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.